

తొర్రూర్ హెచ్‌ఎండీఏ లేఅవుట్ నుంచి నాగార్జునసాగర్ రోడ్డుకు 100 ఫీట్ల రోడ్డు కోసం సర్వే చేస్తున్న అధికారులు

కమ్మగూడ వివేకానంద చౌరస్తా నుంచి తొర్రూర్ హెచ్‌ఎండీఏ లేఅవుట్

- 100 ఫీట్ల రోడ్డు

హయత్‌నగర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ హెచ్‌ఎండీఏ లేఅవుట్ నుంచి నేరుగా కమ్మగూడ వివేకానంద చౌరస్తా వరకు నాగార్జున సాగర్ రహదారిని కలుపుతూ 100ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేయడానికి సోమవారం అధికారులు సర్వేచేశారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, హెచ్‌ఎండీఏ అధికారి శైలజ, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టీపీఓ దినేష్, మండల సర్వేయర్ జ్యోతిలు సోమవారం 100ఫీట్ల రోడ్డు నిర్మాణం కోసం సర్వేచేపట్టారు. ఇంజాపూర్ మీదుగా హెచ్‌ఎండీఏ లేఅవుట్‌కు వెళ్లడానికి దారి ఉంది. కొత్తగా కమ్మగూడ మీదుగా నాగార్జున సాగర్ రోడ్డు లింకుగా మరో రోడ్డు వేయడానికి అధికారులు సర్వే చేపట్టారు.



బాలకృష్ణ గురుస్వామిని, గోవును ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని పాదయాత్ర చేపట్టడం అభినందనీయం

కొత్తపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆరు నెలల క్రితం సైదాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ గోవుతో సహా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర ముగించుకుని బాలకృష్ణ గురుస్వామి బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. సదరు గోవు కొత్తపేటకు చెందిన బీజేపీ నాయకుడు ఠాకూర్ అక్షయ్‌సింగ్‌కు చెందినది. ఆ గోవును మేళ తాళాలతో సోమవారం బాలకృష్ణ గురుస్వామి ఠాకూర్ అక్షయ్‌సింగ్‌కు అప్పగించే కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పవన్‌కుమార్, ఠాకూర్ అక్షయ్ సింగ్ వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు సుందర్‌నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, కొత్త తిరుమల్, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్‌యాదవ్, వీరారెడ్డి, శ్రవణ్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.



షిరిడీ సాయినగర్‌కాలనీలో నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం చైర్మన్ బి.నర్సింహ, అధ్యక్షుడు కె.రఘునందన్‌రావు తదితరులు

షిరిడీ సాయినగర్‌కాలనీ నూతన కార్యవర్గం

చంపాపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని షిరిడీ సాయినగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం చైర్మన్‌గా నాల్గవసారి బి.నర్సింహ, అధ్యక్షుడిగా కె.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగేష్‌గౌడ్, కోశాధికారిగా టి.గోవింద్, ఉపాధ్యక్షులుగా కె.అనంత్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, ఎస్.నరేష్‌చారి, సలహాదారులుగా డి.దినకర్‌రావు, టి.దుర్గాదాస్, కె.వెంకటేష్‌గౌడ్, టి.నారాయణ, సాంస్కృతిక కార్యదర్శులుగా ఎస్.రామాచారి, ఏ.నర్సింహారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘంలో సేవలకు సత్కారం

సైదాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గంలో వివిధ హోదాలలో 22 ఏళ్లుగా సేవలు అందించిన వనం జగదీశ్వర్‌రావుకు ఉగాది పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. కాన్ఫడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సైదాబాద్ జోన్ ఆధ్వర్యంలో సైదాబాద్‌కాలనీ రామాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ కొండపల్లి నర్సింహారెడ్డి శాలువాతో సత్కరించారు. కాలనీ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.రఘునాథ్, కాన్ఫడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఎం.సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, అర్చకుడు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, శ్రీనాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వర్‌రావును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు
- బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టి..

కుషాయిగూడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బస్సును ఓవర్ టేక్ చేస్తూ వేగంగా దూసుకు వచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కుటుంబ యజమాని అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యా పిల్లలు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చర్లపల్లిలో నివసించే కొండెపాటి పుల్లారావు(32) ప్రైవేటు ఉద్యోగి. సోమవారం సాయంత్రం భార్య మల్లీశ్వరి(30), కుమారులు రుత్విక్(8), రాజేష్(6)లో కలిసి అశోక్‌నగర్ నుంచి చర్లపల్లి వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో చర్లపల్లి నుంచి అశోక్ నగర్ వైపు వెళ్తున్న ఇన్నోవా కారు(టీఎస్07యూహెచ్6562) ముందు ఉన్న బస్సును ఓవర్‌టేక్ చేస్తూ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పుల్లారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్సులో గాయపడ్డ ముగ్గురినీ గాంధీ ఆస్పత్రికి తరలించగా, ప్రాణాపాయ స్థితిలో వారు చికిత్స పొందుతున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



చర్లపల్లిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం



పుల్లారావు(ఫైల్)



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ నర్సింహారెడ్డి



హయత్‌బక్షీ మసీదులో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



అక్బర్‌బాగ్ ఈద్గా సామూహిక ప్రార్థనల్లో ఎమ్మెల్యే బలాల

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు
- పరస్పరం ఈద్ శుభాకాంక్షలు

ఎల్బీనగర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలు ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మలక్‌పేట్ నియోజకవర్గాలలోని పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. నెల రోజుల ఉపవాసదీక్షల అనంతరం సోమవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఎల్బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, మన్సూరాబాద్, ఎన్టీఆర్‌నగర్, చింతలకుంట, కర్మన్‌ఘాట్, చంపాపేట, సంతోష్‌నగర్, మలక్‌పేట్, సైదాబాద్, మీర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు భక్తిప్రపత్తులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎన్టీఆర్‌నగర్‌లోని హజ్‌రత్-ఏ-బిలాల్ ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. సరూర్‌నగర్‌లోని కుతుబ్‌షాహిమసీద్ ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సరూర్‌నగర్ ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల అనంతరం రాజ్యసభ మాజీ సభ్యుడు అజీజ్‌పాషా, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ప్రవీన్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆర్‌కేపురం డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్: ఈటల

మన్సూరాబాద్ : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పర్వదినమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ సహార కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ నివాసంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలకు ఎంపీ ఈటల, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు మునగాల హరీష్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

మహమూద్‌అలీ ఇంటికి కేటీఆర్

చాదర్‌ఘాట్ : మలక్‌పేట ఆజంపురలో నివాసముంటున్న మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ సోమవారం విచ్చేసి ఈద్ ముబారక్ తెలియజేశారు. కేటీఆర్ రాగానే మహమూద్‌అలీ కుమారుడు బీఆర్ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆజంఅలీ శాలువ కప్పి ఘన స్వాగతం పలికారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అనితనాయక్, మాజీ వైస్ చైర్మన్లు కొరుడు భూమేష్‌కుమార్, సాయ భువనేశ్వరీ, డివిజన్ల అధ్యక్షులు కామేష్, పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, మారెపల్లి బాబురావు, జగదీష్, మాజీ డైరెక్టర్లు అభిషేకం, కుకట్లపల్లి రవీందర్, లలిత, తుమ్మలపల్లి రవీందర్‌రెడ్డి, లాయక్‌అలీ, తేళ్ల మహేష్‌కుమార్, పగిళ్ల నర్సింగ్ పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్, మాదన్నపేట పరిసరాలలో..

సైదాబాద్ : రంజాన్ సందర్భంగా అక్బర్‌బాగ్, మాదన్నపేట ఈద్గాలు, సైదాబాద్‌లోని ప్రార్థన మందిరాలలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. సైదాబాద్‌లో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ఎమ్మెల్యే అహ్మద్ బలాలను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హస్తినాపురం, చంపాపేట పరిసరాలలో..

చంపాపేట : హస్తినాపురం, చంపాపేట డివిజన్లలోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. హస్తినాపురం డివిజన్ భూపేష్‌గుప్తానగర్ కాలనీ, చంపాపేటలోని ముస్లింబస్తీ, డిఫెన్స్‌కాలనీలోని మసీదు, ఈద్గాలలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

హయత్ బక్షీ మసీదులో..

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లోని చారిత్రక హయత్‌బక్షీ మసీదులో రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వందలాది మంది ముస్లింలు మసీదుకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హయత్‌బక్షీ మసీదుకు చేరుకుని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్, శ్రీధర్‌గౌడ్, కృష్ణారెడ్డి, మైనారిటీ నాయకులు, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

ఇంజాపూర్ ఈద్గాలో..

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ ఈద్గాలో స్థానిక ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్‌గౌడ్ ఈద్గాకు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్ పాషా, నాయకులు మహ్మద్ రహీం, ఇల్యాస్, బురాన్, మజర్, షరీఫ్, యాసీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ పరిసరాలలో..

అబ్దుల్లాపూర్‌మెట్ : రంజాన్ పండుగను మండల పరిధిలోని గ్రామాల్లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కుంట్లూర్ ఆర్ఎస్ఆర్ కాలనీలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



మహమూద్‌అలీ, ఆయన కుమారుడు ఆజంఅలీకి ఈద్ ముబారక్ తెలియజేస్తున్న కేటీఆర్



ఈద్గా వద్ద ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎంపీ అజీజ్‌పాషా, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి



ఆర్ఎస్ఆర్ కాలనీలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీఐ నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి



మన్సూరాబాద్‌లోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి తదితరులు



సరూర్‌నగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎన్టీఆర్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉపేందర్‌రెడ్డి



సలీంనగర్ ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ పి.నరేష్, పక్కన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బల్వంత్, దీపక్ తదితరులు

ఒకే కార్యక్రమం.. వేర్వేరుగా ప్రారంభోత్సవం

- పొలిటికల్ హీట్‌ను పెంచిన కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవం

మన్సూరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు తమ సొంత నిధులతో నిర్మించుకున్న కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే, కార్పొరేటర్, ఎంపీ ముగ్గురు వేరు, వేరుగా ప్రారంభించడం మన్సూరాబాద్ డివిజన్‌లో మళ్లీ పొలిటికల్ హీట్ పెంచింది. వివరాల్లోకి వెళితే.. మన్సూరాబాద్ డివిజన్ సీఆర్ఎంక్లేవ్ కాలనీవాసులు తమ సొంత నిధులతో నిర్మించుకున్న సంక్షేమ సంఘం భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌లు వేరు వేరుగా హాజరై ప్రారంభించారు.

చర్చనీయాంశం

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఓ కాలనీలో ఇటీవల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రోటోకాల్ విషయంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు వేరు వేరుగా ప్రారంభించిన నేపథ్యంలో గొడవలకు దారితీసిన విషయం తెలిసిందే. కాగా సోమవారం సీఆర్ఎంక్లేవ్ కాలనీవాసులు తమ సొంత నిధులతో నిర్మించుకున్న సంక్షేమ సంఘం భవనాన్ని కాలనీవాసుల ఆహ్వానం మేరకు మొదటగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించగా, ఆ తర్వాత కార్పొరేటర్ నర్సింహారెడ్డి, అనంతరం ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి కార్పొరేటర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

దీంతో కాలనీవాసులు ఒకే కార్యక్రమాన్ని ముగ్గురు కలిసి ప్రారంభిస్తే బాగుండేదని, కానీ వేరు వేరుగా ప్రారంభించడం ఏంటని చర్చించుకున్నారు. ప్రొటోకాల్ విషయంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ల మధ్య ఏర్పడిన వివాదం ఎంతవరకు వెళుతుందో అని, దీనికి ముగింపు పలికితే అందరికి బాగుంటుదని పలువురు కాలనీవాసులు మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీవాసులు భిక్షంరెడ్డి, రవీందర్‌రావు, నర్సింహారెడ్డి, రాజేందర్‌రావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఆర్ ఎంక్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ నర్సింహారెడ్డి



సీఆర్ ఎంక్లేవ్‌కాలనీ సంక్షేమ సంఘం భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్ టూ సాహెబ్‌నగర్ రోడ్డుకు మోక్షం

- ఐదు కిలోమీటర్లు..
  100 ఫీట్ల రోడ్డు నిర్మాణం
- పూర్తయిన అధికారుల సర్వే

హయత్‌నగర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న హయత్‌నగర్ టూ సాహెబ్‌నగర్ రోడ్డుకు మోక్షం లభించింది. ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్న ఈ రోడ్డును బాగు చేయండి మహాప్రభో అంటూ వందలాది మంది స్థానికులు, మాజీ కార్పొరేటర్, ప్రస్తుత కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా అధికారులు రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో ఈ రోడ్డు ఎన్నటికి అవుతుందోనని స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెవెన్యూ, సర్వే, టౌన్‌ప్లానింగ్, విజిలెన్స్ అధికారుల బృందం హయత్‌నగర్ పాత రోడ్డుని భారత్ పెట్రోల్ బంకు నుంచి కుమ్మరికుంట కట్ట మీదుగా సాహెబ్‌నగర్ ఎక్స్‌రోడ్డు శివాలయం వరకు సర్వే నిర్వహించారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అధికారుల బృందం నడుచుకుంటు రోడ్డును పరిశీలించారు. రోడ్డుపైన ఉన్న ట్రాఫిక్, రోడ్డు నిర్మాణం ఆవశ్యకత, రోడ్డు నిర్మాణంలో అడ్డుగా వచ్చే నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశం మేరకే అధికారుల బృందం రోడ్డును సర్వే చేసినట్లు తెలుస్తుంది.

ఐదు కిలోమీటర్లు.. 100 ఫీట్ల రోడ్డు

హయత్‌నగర్ పాత జాతీయ రహదారిపైన గల భారత్ పెట్రోల్ బంకు నుంచి కుమ్మరికుంట కట్ట మీదుగా సాహెబ్‌నగర్ ఎక్స్‌రోడ్డు శివాలయం వరకు సుమారు ఐదు కిలోమీటర్లు రోడ్డును నిర్మించడానికి సర్వే మొదలు అయింది. ఈ రోడ్డును దాదాపు 100 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్నారు. రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి రోడ్డు వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లను అనుసంధానం చేస్తూ రోడ్డును నిర్మిస్తామని ఓ అధికారి తెలిపారు. రోడ్డు సర్వే రిపోర్టును ప్రభుత్వానికి అందజేసి ఆ తర్వాత అనుమతి రాగానే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించే అవకాశం ఉంది.

50 కాలనీలకు మేలు

హయత్‌నగర్ టూ సాహెబ్‌నగర్ రోడ్డు నిర్మాణంతో హయత్‌నగర్, బీఎన్‌రెడ్డి డివిజన్‌లకు చెందిన సుమారు 50 కాలనీలకు మేలు జరుగుతుంది. అదేవిధంగా నాగార్జునసాగర్, విజయవాడ జాతీయ రహదారికి అనుసంధానం ఏర్పడుతుంది. శివారు ప్రాంతాల్లోని రైతులు పండించిన పంటలను వనస్థలిపురం రైతు బజారుకు తీసుకురావడానికి ఈ రోడ్డు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. హయత్‌నగర్‌కు చెందిన వారు పది నిముషాల్లో వనస్థలిపురం చేరుకునే అవకాశం ఏర్పడుతుంది. అదేవిధంగా వనస్థలిపురం వాసులు, సాహెబ్‌నగర్ వాసులు తక్కువ సమయంలో హయత్‌నగర్‌కు చేరుకునే అవకాశం కలుగుతుంది. ఇరవై సంవత్సరాలుగా సరైన రోడ్డులేక కాలనీ సామనగర్ చుట్టు ఉన్న 50 కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం దాదాపు రెండు కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని పలువురు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో 50 కాలనీల ప్రజలకు మేలు జరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్వే చేస్తున్న అధికారుల బృందం



కుమ్మరికుంట కట్ట మీదుగా హయత్‌నగర్ టూ సాహెబ్‌నగర్‌కు ఉన్న మట్టిరోడ్డు

ఎమ్మెల్యే కృషి వల్లనే..



ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కృషి వల్లనే హయత్‌నగర్ టూ సామనగర్ రోడ్డుకు మోక్షం లభించింది. సుధీర్‌రెడ్డి పదే పదే ఈ రోడ్డును వంద ఫీట్ల రోడ్డు చేయాలని కోరడం వల్లనే అధికారులు స్పందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ప్రతిపాదనలు పంపడం జరిగింది.

- సామ తిరుమల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్